నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, సోమవారం 18 మార్చి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

బిజినేపల్లిలో ధర్నా చేస్తున్నబీఆ ర్ఎస్‌నా యకులు

ఎమ్మెల్సీ కవితను విడుదల చేయాలి

- అరెస్ట్‌కునిర సనగా బీఆర్ఎస్‌నా యకుల ధర్నా

బిజినేపల్లి, మార్చి 17: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ సరికాదన్నారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి ఎన్నికల డ్రామాలాడుతున్నారన్నారు. ఆమెను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రఘుబాబు, తిరుపతయ్య, ఎంపీటీసీ బాలస్వామి, జహంగీర్ ఉన్నారు.

కుట్రలో భాగంగానే కవిత అరెస్ట్..

అచ్చంపేట, మార్చి 17: రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ నాయకులు శంకర్‌మాదిగ, జైపాల్‌నాయక్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీని అడ్డంపెట్టుకొని ఇతర పార్టీలను బెదిరించేందుకు ఇలాంటి కుయుక్తులకు పాల్పడుతోందన్నారు. అరెస్ట్‌లు బీఆర్ఎస్‌కు కొత్తకాదని, ఉద్యమంలో ఇలాంటి కుట్రలను ఛేదించుకొని రాష్ట్రాన్ని సాధించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసి కుట్ర పన్ని ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారన్నారు.



సంత్‌సేవాలాల్ ఆలయంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న తండావాసులు

ఘనంగా సేవాలాల్ ఉత్సవాలు

- హాజరైన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల, మార్చి 17 : మండలంలోని రామస్వామిగుట్ట తండాలో సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వేర్వేరుగా హాజరై దుర్గామాత, సేవాలాల్‌ను దర్శించుకుని పూజలు చేశారు. అంతకుముందు ఆలయం వద్ద వేదపండితులు హోమం నిర్వహించి మాజీ సర్పంచ్ గంగ్యానాయక్ అందజేసిన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పూజారి చంద్రూనాయక్, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీసర్పంచులు రాజుగౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తాం..

మహబూబ్‌నగర్, మార్చి 17 : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. పాలమూరు రెడ్డి సేవా సమితి 22వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. రెడ్డి కార్పొరేషన్ ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటరంగారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం మీకు రుణపడి ఉంటాం..

- మాజీ మంత్రి సింగిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన యువ ఇంజినీర్

వనపర్తి, మార్చి 17 : సొంత వారే సాయం చేయని నేటి పరిస్థితుల్లో తమకు అపన్న హస్తం అందించారనే అభిమానంతో ఆదివారం మాజీ మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపాడు ఓ ఇంజినీర్. వివరాలిలా.. శ్రీరంగాపురం మండలం జానంపేటకు చెందిన ఈరపాగ నాగరాజుకు గ్రామంలో ఎకరా పొలం ఉన్నది. అందులో ఐదు గుంటలకు సంబంధించిన సర్వే నెంబర్39/ఎ/1 వివాదంలో ఉండగా అప్పట్లో యువ ఇంజినీర్ నాగేశ్వర్‌రావు తన తండ్రి నాగరాజుతో వెళ్లి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కలిసి తమ దీన స్థితిని వివరించారు. దీంతో నిరంజన్‌రెడ్డి సొంతంగా రూ.70వేలు చెల్లించి ఐదు గుంటల భూమిని నాగేశ్వర్‌రావు తండ్రి పేరన చేయించారు. ఈ సందర్భంగా యువ ఇంజినీర్ తన తండ్రితో కలిసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని ఆదివారం కలిసి కన్నీరు కార్చుతూ కృతజ్ఞతలు తెలిపారు. జీవితాంతం వారికి రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్, గిరి, జోహెబ్, మండ్ల కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగేశ్వర్‌రావు

శిశువునుఅప్పగిస్తున్న ఈఎన్‌టీ యశోద

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

అమరచింత, మార్చి 17: మండలంలోని కొంకనోనిపల్లి గ్రామానికి చెందిన శిరీషకు పురిటినొప్పులు రావడంతో ప్రసవం కోసం మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. కాగా మహిళను పరీక్షించిన వైద్యులు శిశువు మెడకు పెద్దపేగు చుట్టుకుందని, సిజేరియన్ చేస్తేనే ప్రసవం సాధ్యమవుతుందని జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు. ఈఎన్‌టీ యశోద, పైలట్ యుగేందర్ అంబులెన్స్‌లో ఆదివారం జిల్లా దవాఖానకు తరలిస్తుండగా మదనాపురం మండలంలోని తిరుమలపురం శివారులో శిరీషకు పురిటి నొప్పులు అధికం కావడంతో ఈఎన్‌టీ, ఫైలట్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేయగా ఆడబిడ్డను జన్మనిచ్చింది. కాగా తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఎంసీహెచ్‌లో చేర్పించి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

వనపర్తి, మార్చి 17: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మెకానిక్ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని పెద్దగూడెం గ్రామంలోని ఖాన్‌చెరువు సమీపంలోని ఓ రైతు పొలంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం వనపర్తి పట్టణానికి చెందిన ఖలీల్ (40) ట్రాన్స్‌ఫార్మర్ మెకానిక్. ఓ రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయడానికి వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని జిల్లా దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రూరల్ ఎస్సై జలందర్‌రెడ్డి వివరణ కోరగా బాధితులు ఇప్పటి వరకు ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కోస్గి, మార్చి 17 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై శేఖర్‌గౌడ్ కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి బొలేరో వాహనంలో 50 బస్తాల్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఆదివారం అధికారులు పరిశీలించి కోస్గి గోదాంకు అప్పగించారన్నారు. వాహనాన్ని సీజ్ చేసి వెంకటయ్య గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ చేసిన వ్యక్తికి రిమాండ్

గోపాల్‌పేట, మార్చి 17 : దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. ఎస్సై హరిప్రసాద్ కథనం మేరకు.. బండపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రాత్రి టీవీ, ట్యాబ్, రాంనగర్ కాలనీలో కొమ్ము రామస్వామి బైక్ అపహరణకు గురైంది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఏదుట్ల ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, పారిపోతున్న మండ్ల జనార్దన్‌ను పట్టుకొని విచారించారు. అతడి వద్ద టీవీ, ట్యాబ్, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు

- ఆనందం వ్యక్తం చేసిన రైతు

ఎర్రవల్లి చౌరస్తా, మార్చి 17 : కవల దూడలకు ఆవు జన్మనిచ్చిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం షేక్‌పల్లిలో చోటుచేసుకున్నది. రైతు బోయ సవారన్నకు చెందిన ఆవు ఆదివారం పావుగంట వ్యవధిలో రెండు దూడలను జన్మనిచ్చింది. ఆవు ఒకేసారి రెండు లేగదూడలను ఈనడంతో రైతు ఆనందం వ్యక్తం చేశాడు. ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

ఆత్మకూరులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

- నేటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- ఈసారి సైన్స్‌లో రెండు పేపర్లు
- నిమిషం నిబంధన తొలగించిన అధికారులు
- పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్
- గ్రామాల్లోని విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు
- కేంద్రాల్లో తాగునీరు, వైద్య సదుపాయం

పదికి పకడ్బందీగా..

నాగర్‌కర్నూల్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి 30వ తేదీ వరకు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్య, పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ, వైద్యశాఖలు సమన్వయంతో చర్యలు తీసుకొనున్నాయి. ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో వందశాతం లక్ష్యం దిశగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరీక్షలకు సన్నద్ధం చేశారు.

నేటి నుంచి మొదలు..

విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు తొలిమెట్టు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రతిరోజూ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. కలెక్టర్ల ఆధ్వర్యంలో విద్యాశాఖ సహా వైద్య, ఆర్టీసీ, విద్యుత్, రెవెన్యూ, పోలీస్ శాఖలతో సమీక్ష నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, జిరాక్స్ కేంద్రాలను మూసివేసేలా ఆదేశించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నా పత్రాలను తెరవనున్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే సంబంధిత సీఎస్, డీవోలపై చర్యలు తీసుకోనున్నారు. ఇక పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్ సహా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లకుండా ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలకు నిమిషం నిబంధన అమలులో లేదని అధికారులు స్పష్టం చేశారు. ఎండాకాలం దృష్ట్యా కేంద్రాల వద్ద తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా చూడాలని సంబంధిత శాఖకు సూచించారు. వైద్య సిబ్బంది కూడా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండనున్నారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నది. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లతోపాటు పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, అధికారుల నియామకాన్ని పూర్తి చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టరాదని అధికారులు ఆదేశించారు. ఈసారి సైన్స్ పరీక్షల్లో రెండు పేపర్లు ఉండనున్నాయి. గతంలో భౌతిక, జీవశాస్త్రాలు ఒకే పేపర్‌గా నిర్వహిస్తుండగా ఈసారి ఫిజిక్స్ పరీక్ష మార్చి 26న, బయాలజీ పరీక్ష 28న నిర్వహించనున్నారు. ఈ విషయమై విద్యార్థులకు ఇదివరకే అవగాహన కల్పించారు.

నిఘా నీడలో పరీక్షలు..

పదో తరగతి పరీక్షలు సీసీ కెమెరాల నిఘా నీడలో కొనసాగనున్నాయి. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పరీక్షా ప్రశ్నాపత్రాన్ని ఓపెన్ చేయడం, ప్యాకింగ్ చేయడం వంటి కార్యక్రమాలన్నీ కూడా సీసీ కెమెరాల నిఘా నీడలో జరుగనున్నది. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవాలి, ఏవైనా ఫిర్యాదులు ఉంటే సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 08545233525కు సంప్రదించాలని వనపర్తి ఇన్‌చార్జి డీఈవో గోవిందరాజులు సూచించారు.

అన్ని వసతులు ఏర్పాటు..

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులను విద్యాశాఖ కల్పిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వెంటనే చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపనున్నారు. అలాగే పోలీస్, విద్యుత్, తపాల శాఖలు పరీక్షల నిర్వహణలో భాగస్వాములు కానున్నాయి.

విద్యార్థులు ఇలా చేయాలి..

- పరీక్షా కేంద్రానికి గంట ముందే వెళ్లాలి.
- గందర గోళానికి గురికాకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్ష రాయాలి.
- తొందరపాటుతో కాకుండా క్రమ పద్ధతిలో సమాధానాలు రాయాలి.
- అక్షర దోషాలు లేకుండా ఆకట్టుకునేల ఆకర్షణీయమైన రీతిలో అక్షరాలు రాయాలి.

యాక్ట్ 25 అమలు...

పరీక్షల్లో అవకతవకలు జరుగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ యాక్ట్ 25ను అమలు చేస్తున్నది. ఈ యాక్ట్ ప్రకారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..

పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాం. సైన్స్‌లో ఈ సారి రెండు పేపర్లు ఉండడం వల్ల గతంలో పడిన ఇబ్బందులు ఈసారి తలెత్తవు. ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించాం. విద్యార్థులు అల్పాహారం తెచ్చుకొని ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి.

- శ్రీలత, జీహెచ్ఎం, జెడ్పీహైస్కూల్, నాగర్‌కర్నూల్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విద్యార్థుల వివరాలు

జిల్లా	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
నాగర్‌కర్నూల్	59	10,526
మహబూబ్‌నగర్	59	12,711
జోగుళాంబ గద్వాల	41	7,378
నారాయణపేట	38	7,678
వనపర్తి	35	6,969

కోడేరులో పత్తా లేని 'భగీరథ'

- వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నకా లనీవాసులు
- చేతిపంపులు,స్కీం బో ర్లకుమ రమ్మతులు చేస్తున్న అధికారులు

కోడేరు, మార్చి 17 : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. పసుపుల నుంచి కోడేరు మీదుగా నాగులపల్లి వరకు బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో కోడేరులోని ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద వంతెన పనులు చేపట్టారు. దీంతో భగీరథ పైపులైన్ పగిలిపోయి వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీనికి తోడు ప్రజల అవసరాలకు సరిపడా నీళ్లు రావడం లేదని గ్రహించిన అధికారులు పంచాయతీ వాటర్‌ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అదేవిధంగా పడావులో ఉన్న చేతిపంపులు, గ్రామపంచాయతీ స్కీం బోర్లను మరమ్మతులు చేసి నీటిని అందించేందుకు ప్రత్యేకాధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే బీసీ కాలనీలో పడావులో ఉన్న బోరుకు మరమ్మతులు చేశారు. అవసరాలకు అనుగుణంగా అధికారులు తాగునీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు.

స్కీం బోరుకుమ రమ్మతులుచేస్తున్న సిబ్బంది

ఎన్నాళ్లకో.. ఎన్నేళ్లకో..

మదనాపురం, మార్చి 17 : మండలంలోని దుప్పలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 ఏండ్ల తర్వాత కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులు రాంరెడ్డి, కురుమన్న, బెల్లం సాయిలు, కరుణాకర్, శ్రీనివాసులు, పుష్పలత, నర్సింహులు, ప్రస్తుత పాఠశాల హెచ్ఎం ఆంజనేయులును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రవీణ్, పురేందర్, విష్ణు, దాసు, రమేశ్‌శెట్టి, వలియొద్దీన్, సుమిత్రబాయి, మంజుల, రాధమ్మ, స్వర్ణలత, శారద, సుధ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మానవపాడు, మార్చి 17: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మానవపాడు మండలంలోని అమరవాయిలో చోటుచేసుకున్నది. ఎస్సై చంద్రకాంత్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన లచ్చగౌడ్ కుమార్తె ఇంద్రజను గట్టు మండలంలోని తప్పెట్లమొర్సుకు చెందిన గోవర్ధన్‌గౌడ్‌కు ఇచ్చి ఆరేండ్ల కిందట పెండ్లి చేశారు. ఇంద్రజ తన నాన్నమ్మ నెలపూజ కార్యక్రమం నిమిత్తం ఈనెల 5న అమరవాయికి వచ్చింది. తన భార్యను తీసుకెళ్లడానికి గోవర్ధన్‌గౌడ్ ఈనెల 16న అమరవాయికి వచ్చాడు. ఊరికెళ్దామని భార్యను అడుగగా.. బ్యూటీపార్లర్ కోర్సు పూర్తి చేశానని.. తనకు షాపు పెట్టించాలని భర్తను కోరింది. కొంతకాలం తర్వాత షాపు పెట్టుకుందామని చెప్పడంతో మనస్తాపం చెంది బాత్రూంలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు అలంపూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలి తండ్రి లచ్చగౌడ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

ధరూరు, మార్చి 17 : ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలో గద్వాల, రాయిచూరు రోడ్డుపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం అల్వాల్‌పాడు గ్రామానికి చెందిన తెలుగు రమేశ్, చాకలి రాముడు గద్వాల నుంచి అల్వాల్‌పాడుకు వస్తుండగా అదే గ్రామానికి చెందిన రమేశ్ అల్వాల్‌పాడు నుంచి గద్వాలకు వెళ్తున్న క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాముకు తీవ్ర గాయాలు కాగా దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

గుడిసెకు నిప్పంటించిన దుండగులు

ధరూరు, మార్చి 17 : ర్యాలంపాడు రిజర్వాయర్ వద్ద చేపల ఫ్రై చేసే గుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా దహనమైంది. మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ రోడ్డు పక్కన ఉన్న నందిమల్ల మునిస్వామికి చెందిన చేపల ఫ్రై చేసే గుడిసెకు ఆదివారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ప్రమాదంలో గుడిసెతోపాటు చేపల ఫ్రై కోసం తెచ్చి పెట్టుకున్న మసాలాలు, వంట సామాను మొత్తం కాలిపోయాయి. సమారుగా రూ.2లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

నల్లమలలో కలప దొంగలు

- నార వేపచెట్లను కూల్చివేసిన దుండగులు
- ఒకరు పరారీ, మరొకరు అదుపులో..

కొల్లాపూర్, మార్చి 17 : కలప దుంగల కోసం నార వేపచెట్లను కూల్చివేసిన ఘటన కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్‌లోని పెద్దూటి బీట్ ప్రాంతంలో చోటు చేసుకున్నది. ఫారెస్ట్ రేంజర్ శరత్‌చంద్రారెడ్డి కథనం మేరకు.. ఈనెల 14న కలప కోసం ఇద్దరు నారవేప చెట్లను కూల్చివేస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సోదాలు చేశామన్నారు. ఈక్రమంలో ఒకరు పరారు కాగా మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు రేంజర్ తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం వెల్లడించారు. అడవిలో సోదాలు నిర్వహించినప్పుడు నార్లాపూర్ లచ్చానాయక్‌తండాకు చెందిన స్మగ్లర్ చిన్న గోపాల్‌నాయక్ తమను చూసి పరారయ్యాడన్నారు. అతడి పాత నేరాల ఆధారంగా అటవీ శాఖ కేసుల్లో నేరస్తుడని తెలినట్లు ఎఫ్ఆర్వో వివరించారు. మరొకరు ముక్కిడిగుండానికి చెందిన వడ్లకొండ లింగస్వామిని స్పాట్‌లోనే అదుపులోకి తీసుకొని పవర్‌గొడ్డలి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా ఈ కేసులో లింగస్వామిని 41 సీఆర్‌పీసీ కింద విడుదల చేసినట్లు పేర్కొన్నారు. నల్లమల అడవిలోకి అక్రమంగా వెళ్లి చెట్ల నరికివేతకు పాల్పడినందుకు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నేడు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా..

పాలమూరు, మార్చి 17 : మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శాంతయ్య ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. దివిటిపల్లిలోని అమరరాజా అడ్వాన్స్డ్ సెల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 200 ఖాళీల భర్తీకి జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలో వివిధ రకాల ట్రేడ్స్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు బయోడేటా, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా జిరాక్స్ సెట్లతో రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.